క్లుప్తంగా

విద్యావంతులకు స్ఫూర్తి ఆచార్య రాంరెడ్డి



ఇగ్నోలో ఆచార్య రాంరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ధర్మారావు తదితరులు

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) వ్యవస్థాపక ఉప కులపతి ఆచార్య జి.రాంరెడ్డి 30వ స్మారక ఉపన్యాసం బుధవారం నిర్వహించారు. తొలుతా ఉషోదయ కూడలిలోని ఇగ్నో విశాఖ ప్రాంతీయ కేంద్రంలో డైరెక్టర్ డాక్టర్ గోనిపాటి ధర్మారావు తదితరులు రాంరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ దేశంలో దూరవిద్య పితామహుడిగా రాంరెడ్డి చిరస్మరణీయుడన్నారు. దూర విద్యా ద్వారా ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకొచ్చి లక్షల మందిని విద్యావంతులుగా తీర్చిదిద్దారన్నారు. ఆయన చూపిన బాటలో నేటికీ ఇగ్నో ద్వారా వేల మందికి ఏటా ఉన్నత విద్య సాకారమవుతోందని తెలిపారు. రాంరెడ్డి స్ఫూర్తితో సమాజంలోని ప్రతి ఒక్కరూ విద్యావంతులయ్యేందుకు ఇగ్నో సేవలు వినియోగించుకోవాన్నారు. కార్యక్రమంలో ఇగ్నో ఉపసంచాలకుడు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అరుణ

బీచ్‌రోడ్డు: మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళ ఆత్మహత్యాయత్నం చేసుకుంది. వివరాలిలా.. రామ్‌నగర్‌కు చెందిన అరుణ అనే మహిళ బుధవారం రాత్రి తన ఇంట్లో లైజాల్ తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందడంతో ఆమెకు ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాల కోసం త్రీ టౌన్ పోలీసులు ఆరా తీస్తున్నారు.

వాల్తేర్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా బాలసతీష్



బాలసతీష్‌ను అభినందిస్తున్న ఎంఈఎస్ బిల్డర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: నగరంలోని వాల్తేర్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా ఎంఈఎస్ బిల్డర్స్ అసోసియేషన్ జాతీయ వైస్ ప్రెసిడెంట్ సి.బాలసతీష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఎంఈఎస్ బిల్డర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు. ఇటీవల జరిగిన వాల్తేర్ క్లబ్ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా సమీప ప్రత్యర్థి బి.లక్ష్మణ్ పాత్రోపై బాలసతీష్ 400 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కార్యక్రమంలో ఎంఈఎస్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ జి.వి.రెడ్డి, కార్యదర్శి బి.వి.ఎస్.సుబ్బరాజు, ఉపాధ్యక్షులు ఎన్.రాజశేఖర్, డి.సూరిబాబు, ఎం.వి.రమణ, పి.నారాయణరావు, జాయింట్ సెక్రటరీలు అనంతరాజు, జి.శంకర్‌రెడ్డి, బి.వేణుగోపాలరావు, కోశాధికారి డి.ఇ.వి.రామప్రసాదరెడ్డి, కౌన్సెల్ సభ్యులు పాల్గొన్నారు.

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

బీచ్‌రోడ్డు: తొలగించిన స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి వెంటనే తీసుకోవాలని ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన నిరాహార దీక్ష 1554వ రోజుకు చేరుకున్న సందర్భంగా బుధవారం ఐద్వా సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులు జీతాలు పెంచాలనో, రెగ్యులర్ చేయాలనో సమ్మె చేయడం లేదని, ప్రభుత్వమే పథకం ప్రకారం ఉద్యోగులను తొలగించడం వల్ల వారు సమ్మెలో ఉన్నారన్నారు. ఈ పోరాటానికి ఐద్వా సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందన్నారు. నీతి అయోగ్ సమావేశానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరయ్యారని, స్టీల్‌ప్లాంట్ గురించి కనీసం మాట్లాడినట్టు వార్తలు రాలేదన్నారు. ఆర్.విమల, బి.ఈశ్వరమ్మ, బి.భారతి, కె.కుమారి, జి.లక్ష్మి, డి.కొండమ్మ, వి. ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

తెరిపివ్వని వాన.. కష్టజీవుల హైరానా

వర్షాలతో పనులు లేక ఇబ్బందులు పడుతున్న కూలీలు



పనుల కోసం ఇసుకతోట జంక్షన్ వద్ద వర్షంలో కూలీల పడిగాపులు

- వ్యాపారాలు సాగక చిరు వ్యాపారులు విలవిల
- బోసిపోయిన కూరగాయల మార్కెట్లు



వాహనాలపై వచ్చిన వారిని చుట్టుముట్టి పనుల కోసం అడుగుతున్న కూలీలు

మద్దిలపాలెం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కష్టజీవుల జీవనం అస్తవ్యస్తంగా మారింది. రెక్కాడితే కానీ డొక్కాడని కూలీల బతుకుల్లో తెరిపివ్వని వాన ఆవేదన నింపుతోంది. ఐదు రోజులుగా పనులు లేక.. చేతుల్లో డబ్బులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. రోజువారీ కూలీ పనులు చేసుకుంటే జీవించే వీరి పరిస్థితి దయనీయంగా మారింది. ప్రతి రోజు ఇసుకతోట పెట్రోల్ బంక్ వద్దకు వందలాదిగా కూలీలు ఎంతో ఆశగా పనుల కోసం వస్తున్నారు. వారి దగ్గరలో ఏ వాహనం ఆగినా.. పరుగునా వెళ్లి పనులు ఉన్నాయా బాబూ.. అంటూ దీనంగా అడుగుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షం కారణంగా నిర్మాణం రంగంలో కొన్ని విభాగాల్లో పనులు నిలిపివేశారు. వాన ప్రభావంతో నిర్మాణ పనులు చేయడానికి ముందుకు రాకపోవడంతో కూలీలకు పనులు లేకుండా పోయాయి. మరోవైపు వ్యాపారాలు సాగక చిరు వ్యాపారుల ఆర్థికంగా విలవిలలాడుతున్నారు.



వినియోగదారులు లేక బోసిపోయిన పిఠాపురం కాలనీ కూరగాయల మార్కెట్

చిరు వ్యాపారులు సతమతం

తాజాగా కురుస్తున్న వర్షాలతో వ్యాపారాలు సాగక చిరు వ్యాపారులు సతమతమవుతున్నారు. పెట్టుబడి సొమ్ము రాక ఆర్థికంగా విలవిలలాడుతున్నారు. రోజువారీగా కొనుగోలు చేసిన కూరగాయలు, ఆకుకూరలు తాజాగా ఉంటే విక్రయాలవుతాయి. వర్షాల కారణంగా కొనుగోలుదారులు రాకపోవడంతో సరకు మిగిలిపోతోంది. ఇలా మిగిలిన కూరగాయలు వాడిపోతున్నాయి. దీంతో పెట్టుబడి డబ్బులు రాకపోవడంతో చిరు వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. రోజూ తెల్లవారుజామున మార్కెట్‌కు తాజా కూరగాయలు తెచ్చి చిరు వ్యాపారులు విక్రయిస్తుంటారు. వర్షాల కారణంగా తెచ్చిన సరకు అమ్ముడు పోక నష్టాలను చవిస్తున్నారు. మద్దిలపాలెం, పిఠాపురం కాలనీ కూరగాయల బజార్ వినియోగదారులు లేక బోసిపోయింది. ఇక్కడ రోజూ కూరగాయలు మిగిలిపోవడంతో పాడవుతున్న సరకును చూసి వ్యాపారులు కంటనీరు పెట్టుకుంటున్నారు. తోపుడు బండ్లపై కూరగాయలు, కొబ్బరికాయలు, పండ్లు, టిఫిన్లు పెట్టుకుని జీవించే వారు వర్షాలతో వ్యాపారాలు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. వరుణుడు కరుణించి తగ్గుముఖం పట్టాలని ప్రార్థిస్తున్నామని కూలీలు, చిరు వ్యాపారులు చెబుతున్నారు.

రెక్కాడితేనే డొక్కాడేది



రోజూ కూలీ పనికి వెళ్తే గాని పూట గడవని పరిస్థితి. ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పనులు దొరక్క పస్తులుండాల్సి వస్తోంది. వర్షం కారణంగా చాలా వరకు నిర్మాణ పనులు నిలిపివేశారు. దీంతో వేరే పనులు చేయలేక ఇక్కట్లు పడుతున్నాం. ఇంటి అద్దె కట్టడానికి డబ్బు లేకుండా పోయాయి.

-కె.రాజు, కూలీ, పాతవెంకోజీపాలెం

కూలీల ఎదురుచూపులు

జాతీయ రహదారిపై ఇసుకతోట పెట్రోల్ బంక్ వద్ద పని కోసం కూలీలు నిత్యం ఎదురు చూస్తుంటారు. తెల్లవారుజామున పనుల కోసం వచ్చిన కూలీలు ఉదయం 11 గంటల వరకూ వేచి చూసి.. పని దొరక్క నిరాశగా ఇంటి ముఖం పడుతున్నారు. ఏ రోజుకారోజు కూలీ డబ్బులతో బతకడం అలవాటు పడిన కూలీలు పనులు లేక విలవిలాడుతున్నారు. చాలా వరకూ ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి వలసవచ్చి అద్దె ఇళ్లలో ఉంటున్నారు. అద్దె చెల్లించడానికి డబ్బులు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ప్రత్యామ్నయ్య పనులు చేసే అవకాశం లేక కూలీ పనుల కోసం నిరీక్షిస్తున్నారు.

పనులు లేక పస్తులుంటున్నాం



శ్రీకాకుళం నుంచి వలస వచ్చిన నగరంలో కూలీ పనులు చేసుకుంటున్నాం. ఈ పని తప్పా మరో పని చేయలేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. వర్షం కురుస్తుండటంతో పనులు దొరకడం లేదు. ఏరోజుకారోజు పనిచేస్తే బత్తెం. అలాంటి బతుకుల్లో కురుస్తున్న వర్షాలు కూలీలను పస్తులుంచుతున్నాయి.

- కె.రాజాబాబు, తాపీమేస్త్రీ, ఎండాడ

పని కోసం పరుగులు పెడుతున్నాం



ఇసుకతోట జంక్షన్‌కు కూలీ పనుల కోసం రోజూ ఉదయాన్నే వస్తున్నాం. ఎవరూ కూలీల కోసం రావడం లేదు. దీంతో ఏ వాహనం ఆగిన.. ఆశగా దాని వద్దకు పరుగులు పెడుతున్నాం. పనుల కోసం కాదని తెలిసి నిరాశ పడుతున్నాం. ఐదు రోజులుగా ఇదే పరిస్థితి. పనులు లేక.. చేతిలో పైసా లేక ఇబ్బంది పడుతున్నాం.

- వి.నర్సమ్మ, మహిళా కూలీ, ఇసుకతోట



ఉద్యానవనం.. అధ్వానం

- పిచ్చి మొక్కలతో నిండిన జీవీఎంసీ పార్కు
- తుప్పు పడుతున్న ఆట పరికరాలు
- పట్టించుకోని అధికారులు



పార్కులో ఆట పరికరాల చుట్టూ పిచ్చి మొక్కలు



పాత డెయిరీఫారం వద్ద జీవీఎంసీ పార్కులో పాత్‌వేలపై దట్టంగా పిచ్చి మొక్కలు

ఆరిలోవ: జాతీయ రహదారిని ఆనుకొని పాత డెయిరీఫారం వద్ద ఏసీబీ కార్యాలయం ఎదురుగా గల జీవీఎంసీ పార్కు పిచ్చి మొక్కలతో నిండిపోయింది. జీవీఎంసీ సుమారు రూ.40 లక్షలతో ఏడేళ్ల కిందట ఇక్కడ గెడ్డ అంచున పార్కు నిర్మాణం చేపట్టింది. పొడవైన ఈ పార్కు లోపల వాకింగ్‌కు అనుకూలంగా ఉండేందుకు పాత్‌వేలు నిర్మించింది. ఈ పార్కు నిర్మించిన ప్రారంభంలో స్థానికులు ఉదయం, సాయంత్రం వేళల్లో ఇక్కడ వాకింగ్ చేస్తుండేవారు. పార్కులో పిల్లల కోసం పలు రకాల ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. అంతవరకు బాగానే ఉంది. ఈ పార్కు నిర్వహణ గురించి జీవీఎంసీ సిబ్బంది పట్టించుకోలేదు. దీంతో తరచూ దీనిలో పిచ్చి మొక్కలు దట్టంగా, ఏపుగా పెరిగిపోతున్నాయి.

పాములకు ఆవాసం

ఈ పార్కు కొండ(సీతకొండ) అంచున ఉండటంతో దీనిలోకి పాములు చేరుతున్నాయి. గతేడాది ఇందులో ఉన్న నీటి సరఫరా సంప్‌లో కొండచిలువ చేరి స్థానికులు, నీటి సరఫరా విభాగం సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేసిన విషయం తెలిసిందే. నీటి సరఫరా విభాగం సిబ్బంది పాములు పట్టే వ్యక్తిని రప్పించాల్సిన పరిస్థితి వచ్చింది. అప్పట్లో ఆఘమేఘాలపై పార్కులోని పిచ్చి మొక్కలను కొట్టించారు. ఇప్పుడు ఏడాదిగా ఈ పార్కును శుభ్రం చేయకపోవడంతో మళ్లీ కథ మొదటికే వచ్చింది. పార్కు లోపల దట్టంగా పిచ్చి మొక్కలు మొలిచాయి. పిల్లల ఆట పరికరాలు, పాత్‌వేలను ఇవి మూసేస్తున్నాయి. దీంతో పిల్లలు ఆటల కోసం పార్కులోకి వెళ్లడం మానేశారు. ఆట పరికరాలు తుప్పుపట్టిపోతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ పార్కు పరిస్థితి అపరిశుభ్రంగా.. అధ్వానంగా తయారైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు తక్షణం స్పందించి పార్కును శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



17వ వార్డు శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు

మద్దిలపాలెం: వైఎస్సార్‌సీపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పిలుపునిచ్చారు. సీతమ్మధార రాధా కృష్ణ కల్యాణ మండపంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం 17వ వార్డు శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17వ వార్డులో పార్టీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని కోరారు. అందరూ ఏకాభిప్రాయంతో వార్డు, బూత్ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడే వారిని మాత్రమే ఎంపిక చేయాలన్నారు. నిబద్ధతతో పనిచేసే ప్రతి కార్యకర్తకు భవిష్యత్తులో తగిన గుర్తింపు ఉంటుందని, ఆ బాధ్యత తాను తీసుకుంటానని మొల్లి అప్పారావు భరోసా ఇచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముచ్చల సురేష్, వార్డు అధ్యక్షుడు నీలారెడ్డి, సుబ్రహ్మణ్యం, పీలా ప్రేమ్, జోషీలా, సత్యవతి, బోరా కుమార్‌రెడ్డి, పలికేల రాంబాబు, మంగరాజురెడ్డి, లవణ్ కుమార్, లక్ష్మణరెడ్డి, దువ్వ రవిరెడ్డి, సిరపు గణేష్, పిడింట్ల వాసు, దళాయి హరనాథ్, మరడ నాగమ్మ, కండిపల్లి కుమార్, పిడింట్ల కుసుమ, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి పాలనలో విద్యార్థులకు బొద్దింకల భోజనం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మంచా మల్లేశ్వరి

మహారాణిపేట: తమ ప్రభుత్వంలో జగనన్న గోరు ముద్ద పథకాన్ని పక్కాగా అమలు చేస్తే.. కూటమి పాలనలో విద్యార్థులకు బొద్దింక గోరుముద్ద పథకాన్ని అమలు చేస్తున్నారంటూ వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మంచా మల్లేశ్వరి విమర్శించారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం కార్పొరేటర్లు పద్మారెడ్డి, శశికళ, పార్టీ నాయకురాలు బయ్యవరపు రాధతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో విద్యా వ్యవస్థపై పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పాఠశాలలు ప్రారంభించి నేటికి నాలుగు వారాలైనా వారికి సరైన మౌలిక వసతులు కూడా కల్పించలేదని ఎద్దేవా చేశారు. పాయకరావుపేటలోని బీసీ ఉమెన్స్ హాస్టల్‌లో రాష్ట్ర హోం మంత్రి అనిత తిన్న భోజనంలో బొద్దింక ఉంటే.. అది తీసి చూపించిన ఆమె ఇప్పుడు తలవెంట్రుక మాత్రమే ఉందని మాట మార్చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కుమారుడు లోకేష్ శాఖ కావడంతో ప్రజలను మభ్య పెట్టేందుకు హోం మంత్రి తీవ్రంగా శ్రమించారన్నారు. ప్రజల్లో చైతన్యం వచ్చిందని, ఎక్కడైనా తప్పు జరిగితే తక్షణమే స్పందించి వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని పేర్కొన్నారు. హోం మంత్రి మీడియా ముందుకు వచ్చినంత మాత్రాన నిజం అబద్ధమైపోదని మండిపడ్డారు. వసతి గృహాల్లో మంచి భోజనం పెట్టి, నాణ్యమైన విద్యను అందించే దిశగా పాలన సాగిస్తే మంచిదని, లేదంటే విద్యార్థుల తల్లిదండ్రులే కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులకు బుద్ధి చెప్పే పరిస్థితులు వస్తాయని మల్లేశ్వరి హెచ్చరించారు.

ముడసర్లోవ రిజర్వాయర్‌లో చెత్త చేరకుండా చర్యలు



ముడసర్లోవ రిజర్వాయర్‌లోకి చెత్త చేరే మార్గాన్ని పరిశీలిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

ఆరిలోవ: ముడసర్లోవ రిజర్వాయర్ పరిసరాలను బుధవారం జీవీఎంసీ జోన్-2 కమిషనర్ కనక మహాలక్ష్మి సందర్శించారు. రామకృష్ణాపురం నుంచి ప్రవహిస్తున్న గెడ్డ, అందులో వరద నీటితో రిజర్వాయర్‌లోకి చేరుతున్న చెత్తను పరిశీలించారు. పారిశుధ్య సిబ్బందిని పిలిపించి గెడ్డలో నీటి ద్వారా వచ్చి రిజర్వాయర్ అంచున పేరుకుపోయిన చెత్తను తొలగించాలని ఆదేశించారు. సిబ్బంది తొలగిస్తున్న చెత్తను పరిశీలించారు. గెడ్డలో నీటి ద్వారా వస్తున్న చెత్త రిజర్వాయర్‌లోకి చేరకుండా చర్యలు చేపడతామని ఈ సందర్భంగా జెడ్సీ తెలిపారు. రిజర్వాయర్‌లోకి చెత్త చేరకుండా గ్రిల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి గ్రిల్స్ కోసం చర్చిస్తామని తెలిపారు. దానికి అవసరమైన నిధుల కోసం బిల్లు పెడతామన్నారు. తాగునీటి విషయంలో జాగ్రతలు తీసుకుంటామన్నారు.

బీచ్ రోడ్డులో భారీ గుంత



పోలీస్ మెస్ ఎదురుగా రహదారి కుంగడంతో ఏర్పడిన గుంత

ఏయూక్యాంపస్: బీచ్ రోడ్డులో పోలీస్ మెస్ ఎదురుగా భారీ గుంత ఏర్పడింది. ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రధాన రహదారి ఒకవైపు కుంగిపోయింది. దీంతో రోడ్డుపై గొయ్యిలా తయారైంది. తాత్కాలికంగా ఈ గుంత చుట్టూ స్టాపర్లు పెట్టి, ప్లాస్టిక్ తాళ్లను కట్టారు. దాదాపు మూడు నెలల నుంచి అ ప్రాంతంలో నేల కుంగడం ప్రారంభమైంది. ఈ సమస్యపై 'సాక్షి' పలుమార్లు కథనాలు సైతం ప్రచురించింది. ప్రాథమిక దశలోనే అధికారులు స్పందించి మరమ్మతులు చేసి ఉంటే పరిస్థితి ఇంత వరకు వచ్చేది కాదు. ప్రస్తుతం సగానికి పైగా రహదారి ఈ గుంతతో నిండిపోయింది. మరింత కుంగితే ఒకవైపు రహదారిని పూర్తిగా మూసివేసే ప్రమాదముంది. అధికారులు తక్షణం స్పందించి రహదారి వద్ద మరమ్మతులు చేయాలని పలువురు ప్రయాణికులు, సందర్శకులు కోరుతున్నారు.

రేషన్ కోసం వర్షంలో నిరీక్షణ



ఆరిలోవ కాలనీ రేషన్ డిపో వద్ద వర్షంలో గొడుగులు వేసుకొని క్యూలో ఉన్న లబ్ధిదారులు

ఆరిలోవ: రేషన్ డిపోల వద్ద సరకుల కోసం పేదలు తిప్పలు పడుతున్నారు. ఎండ, వానకు ఇబ్బంది పడుతూ డిపోల వద్ద క్యూ కడుతున్నారు. ఇంతవరకు ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ సరకులు పంపిణీ చేసే వాహనాలను కూటమి ప్రభుత్వం గత నెలలో రద్దు చేసిన విషయం తెలిసిందే. దీంతో పాత పద్ధతిలోనే రేషన్ డిపోల్లో గత నెల నుంచి సరకులు పంపిణీ చేస్తున్నారు. ఈ నెల రేషన్ సరకుల పంపిణీ మంగళవారం నుంచి ప్రారంభించారు. బుధవారం కురిసిన వర్షానికి రేషన్ డిపోల వద్ద లబ్ధిదారులు గొడుగులు వేసుకొని గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. దారపాలెం, ఆరిలోవ కాలనీ, బాలాజీనగర్, అన్నానగర్, ఆదర్శనగర్, విశాలాక్షినగర్, పెదగదిలి, సంజయ్‌గాంధీ కాలనీ తదితర ప్రాంతాల రేషన్ డిపోల వద్ద వర్షంలో సైతం క్యూ కట్టి రేషన్ తీసుకోవాల్సి వచ్చింది. దీంతో మళ్లీ ఇక్కట్లు మొదలయ్యాయంటూ లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రేషన్ వాహనాలు ఇంటి వద్దకే వచ్చి సరకులు అందించేవని, వర్షం కురిసినా ఇబ్బంది ఉండేది కాదని చెబుతున్నారు.

పిల్లల ఆరోగ్యంపై అప్రమత్తం



మాట్లాడుతున్న డాక్టర్ శేషగిరి

బీచ్‌రోడ్డు: వర్షా కాలంలో పిల్లలకు వచ్చే వైరల్ ఇన్ఫెక్షన్లపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని లోటస్ హాస్పిటల్ చీఫ్ కన్సల్టెంట్ నియోనాటాలజిస్ట్, పీడియాట్రీషియన్ డాక్టర్ కె.శేషగిరి సూచించారు. సిరిపురంలోని ఆస్పత్రిలో బుధవారం పిల్లల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను మీడియాకు వివరించారు. స్కూల్‌లో పిల్లలు ఎవరికైనా వైరల్ ఇన్ఫెక్షన్ ఉంటే.. అది అందరికి అంటుకుంటుందని, సీజనల్ వ్యాక్సిన్ వేసుకోవడం వల్ల అరికట్టవచ్చన్నారు. పిల్లలకు పౌష్టికాహారం, కూరగాయలు, గుడ్లు, పండ్లు అందించాలని, ఫాస్ట్‌ఫుడ్‌కు దూరంగా ఉంచాలని సూచించారు. కోవిడ్ తర్వాత ఆటిజం కేసులు ఎక్కువగా వస్తున్నాయని, మొబైల్, టీవీ అధికంగా చూడటం వల్ల వీటి సంఖ్య పెరుగుతోందని తెలిపారు. పిల్లలకు మొబైల్ ఇవ్వకూడదని సూచించారు. నెలలు నిండకుండా పుట్టిన, బరువు తక్కువున్న పిల్లల్లో శ్వాసకోశ, జీర్ణ సమస్యలు ఉంటాయన్నారు. ఇపుడున్న పరిజ్ఞానంతో 500, 600 గ్రాముల శిశువులను కూడా రక్షించగలుగుతున్నామని చెప్పారు.

హరిత విశాఖ సాధనే లక్ష్యం



మిద్దె తోటల ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న వనమాలి మగువల బృందం



గుడ్డ సంచులు ప్రదర్శిస్తున్న మహిళలు

మద్దిలపాలెం: హరిత విశాఖను సాధించడమే లక్ష్యంగా కృషి చేద్దామని వనమాలి, సీటీజీ, మన కూరగాయల తోట గ్రూప్‌ల అడ్మిన్‌లు అరుణ, జ్యోతి, సరిత పిలుపునిచ్చారు. పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో బుధవారం వనమాలి, సీటీజీ, మన కూరగాయల తోట సంస్థలు నిర్వహించిన మహామేళా విజయవంతమైంది. ఇళ్ల పైకప్పు మీద వ్యవసాయం చేసే వేలాది మంది మిద్దె రైతు మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమంలో బోన్సాయ్ మొక్కల ప్రదర్శన, మొక్కలతో తయారు చేసిన మీనియేచర్స్ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నాయి. నయనానందకరంగా మిద్దె తోటల ఎగ్జిబిషన్ ఉండటం విశేషం. పెందుర్తి ప్రభుత్వ బాలికల వసతి గృహం విద్యార్థులు ప్రదర్శించిన వాడొద్దు వాడొద్దు ప్లాస్టిక్.. నృత్యం అందరినీ ఆకట్టుకుంది. పెందుర్తి గగనసిరి డ్యాన్స్ అకాడమీ విద్యార్థుల ప్రణామం.. ప్రణామం నృత్య ప్రదర్శన ఆలోచింపజేసింది. స్వాగత నృత్యం అలరించింది. ప్రపంచానికి అన్నం పెట్టే రైతన్న ఆవేదనను కార్తికేయ రెడ్డి అనే షీలానగర్‌కు చెందిన 5వ తరగతి విద్యార్థి ప్రదర్శించి మెప్పించాడు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరుశురాంరాజు వనమాలి, సీటీజీ సిటీ ఏరియా ఇన్‌చార్జిలకు బహుమతులు అందజేశారు. జనసేన పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ బొడ్డేపల్లి రఘు ఎగ్జిబిషన్‌ను తిలకించి ప్రతి ఒక్కరినీ అభినందించారు. విశాఖ పోర్ట్ ట్రస్ట్ ఉద్యానవనాల అధికారి రాధిక చేతుల మీదుగా వెయ్యి పండ్ల జాతి మొక్కలను పంపిణీ చేశారు. రాష్ట్ర కాలుష్య నివారణ మండలి రీజనల్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ ముకుందరావు కోరమాండల్ పరిశ్రమ వారి గుడ్డ సంచులను మహిళలకు అందజేశారు. విభిన్న లక్కీ డ్రాలు తీసి బహుమతులు అందించారు. కార్యక్రమంలో మహానగర పర్యావరణ సంయోజక్ రంగాచార్యులు, ఆర్‌ఎస్‌ఎస్ మహానగర కార్యవాహ కృష్ణమాచార్యులు, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం పాల్గొన్నారు.